
# మంగమ్మగారు మార్కెటింగ్ స్ట్రాటజీ

"అమ్మా! ఇవాళ మన రియాల్టరు ఫోను చేశాడు. స్టేజింగ్ కోసం మానేజర్‌ని ఇంటికి పంపిస్తున్నాట్ట." శనివారం ఉదయం నిద్రలేవగానే తల్లికి చెప్పింది బుజ్జి.



"ఇంట్లో స్టేజి ఏర్పాటు చేస్తారా ఏమిటే? పోయిన నెల చిన్నదాని పుట్టిన రోజుకు పెరట్లో అదేదో గాలికొట్టి పెట్టే జంప్ హౌస్ పెట్టించావు.

'పార్టీకి వచ్చిన పిల్లలు అందులో ఎక్కి ఎగిరి ఆడుకుంటారమ్మా' అంటూ బోలెడు అద్దె కట్టి తెప్పించావుదాన్ని, ఇప్పుడీ స్టేజింగ్ ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగారు మంగమ్మగారు.

"స్టేజి అంటే వేదిక అని కాదమ్మా, స్టేజింగ్ అంటే మన ఇల్లు అందంగా, ఆకర్షణీయంగా కనబడేట్టు అలంకరిస్తారన్నమాట." అంది బుజ్జి.

"వాళ్ళ మొహం! మన ఇంటిని ఎవరో వచ్చి సర్దాలా? మనిల్లు ఎప్పుడూ అందంగా, శుభ్రంగా వుంచుతావు కదమ్మా!" ప్రేమగా కూతురి వైపు చూసి అన్నారావిడ.

"అది సరేనమ్మా. కానీ మనం ఇల్లు అమ్మకానికి పెడుతున్నాముకదా. ఇది అమ్మేసి నాలుగు పడక గదులుండే ఇంకా పెద్ద ఇల్లు కొందామనుకున్నాం కదమ్మా. అందుకని ఇల్లు అమ్మడంకోసం ఓపెన్ హౌస్ పెడతారన్నమాట. దానికోసం ముందుగా ఇంటిముందువైపు ఫ్రెష్‌గా పెయింటింగు వేయడం, స్టేజింగు, లాండ్ స్కేపింగు లాటివి వాళ్ళ ఖర్చుతో చేస్తారు. "అంటూ విశదీకరించింది బుజ్జి.

"వాళ్ళ ఖర్చుతో అంటున్నావు. బాగుంది. ఓపెన్ హౌస్ ఏమిటి. మనిల్లు తెరిచేవుందిగా" అనడిగిందామె.

"ఇల్లు అమ్మకానికి పెట్టాక రియాల్టరు ఈ ఇంటి టూర్ ఫోటోలు, ఖరీదు లాటి వివరాలు కంప్యూటర్‌లో నెట్‌మీద పెడతాడు. అందుకే మొన్న ఇల్లంతా విడియో తీశాడు. ఇంటి ఫ్రంట్, బ్యాక్ యార్డ్ గదులు అన్నీ నెట్‌మీద చూసినా మరి కొనుక్కునేవాళ్ళు ఇల్లు చూసుకోవాలి కదా! అందుకని శనివారమో, ఆదివారమో మనం ఇంట్లో వుండకుండా వెళ్ళిపోవాలి. రియాల్టరు మాత్రం వుంటారు. కొనాలని ఇష్టమున్నవారు వచ్చి ఇల్లు ప్రతి అంగుళం చూసుకుని వెళ్ళి వాళ్ళు ఎంత ఇవ్వగలరో బిడ్ చేస్తారు. ఇవన్నీ చేసిన దానికి మనం రియాల్టర్‌కి ముప్పైవేలో ఎంతో ఇవాల్సి వస్తుంది. అంటే మన ఇల్లు అమ్మిపెట్టినందుకన్నమాట" ఓపిగ్గా వివరించింది బుజ్జి.

వీళ్ళు ఇంకా పొద్దుటి ఫలహారం కార్యక్రమంలో వుండగానే ఒక చైనీస్ పిల్ల ఇద్దరు అసిస్టెంట్స్‌ని వెంటేసుకుని వచ్చేసింది.

వాళ్ళు ఇల్లంతా తిరిగి ఏమేమిచేయాలో రాసుకుని వెళ్ళిపోయారు.

ఇంకో గంటలో 'యుహోల్' బండిలో సోఫాసెట్టు, టీపాయ్, ఫ్లవర్ వేజులు. ఫోటోలు లాటివి తీసుకొచ్చిందా చైనా పిల్ల.

డ్రాయింగు రూములోవున్న సోఫా సెట్టును కారు గరాజ్‌లో పెట్టేసి తాను తీసుకొచ్చిన సోఫాసెట్టు అమర్చింది.

గోడలకున్న పటాలు తీసేసి తను తెచ్చిన సీనరీలు తగిలించింది. టీపాయ్ మీద పూలకుండీ తీసేసి ఇంతెత్తువున్న ఇత్తడి క్యాండిల్ స్టాండు పెట్టింది.

వంటింటి 'ఐలాండ్' మీద పూలకుండీ పెట్టింది. చిన్నదాని గదిలో పెద్ద టెడ్డీ బేర్ బొమ్మ, రాకింగ్ ఛెయిర్ వేసింది.

ఆఖరికి మంచాలమీది దుప్పట్లు కూడా మార్చేసింది. పిల్లోస్‌కూడా షో పీసుల్లా సర్దింది.

ఒకసారి తను సర్దిన ఇంటిని పరిశీలనగా చూసి "నౌ ఇట్ లుక్స్ గుడ్" అంది తృప్తిగా.

"రేపు ఓపెన్ హౌస్ వుంటుంది. నేను సర్దినట్టే వుంచాలిమీరు" స్వీట్‌గా నవ్వుతూ చెప్పి వెళ్ళిపోయింది.

సాయంకాలం ఇంకో ఇద్దరు ఫిలిఫ్ఫెన్ మనుషులు వచ్చి ఇంటి ముందు పూల మొక్కలు నాటారు. ఏవో రాళ్ళు తెచ్చి అక్కడక్కడ పెట్టారు సహజ సౌందర్యం కోసమని. అలాగే పెరట్లో వరుసగా వున్న గులాబీ చెట్లను ట్రిమ్ చేశారు. మధ్యలో ఇంకొన్ని పూల మొక్కలు వేశారు. లాన్ మోయింగ్ మెషిన్‌తో పెరిగిన గడ్డిని పద్ధతిగా కత్తిరించి వెళ్ళారు.

"లాండ్ స్కేపింగ్ అంటే ఇదే" అని చెప్పింది బుజ్జి.

మొక్కలున్న వరుసనిండా ఏవో ఎఱ్ఱని చెక్క ముక్కలు చల్లి వెళ్ళారు.

ఇంట్లో ఇండియన్ వంటల వాసన రాకుండా చూడమని చెప్పింది చైనా పిల్ల.

"అంటే మనం వంట చేసుకోకూడదా?" నోరు నొక్కుకుంటూ అడిగారు మంగమ్మగారు.

"అలా కాదమ్మా మరీ ఘాటైన మసాలా వాసనలు వద్దని చెప్పారంతే" అంది బుజ్జి.

ఆ ఇల్లు కొని నాలుగేళ్ళవుతోంది. ఎంతో విశాలంగా వున్న మూడు పడక గదుల ఇల్లు.

డైనింగు హాల్లోనుండి అద్దాల తలుపులకుండా పెరట్లోని పచ్చని లాన్, పూల మొక్కలు కనబడుతుంటాయి. డైనింగు హాల్లోను, నడవాలోనూ బోలెడు వెలుగు వచ్చేట్టు 'సన్‌రూఫ్' కూడా వుంది.

కంప్యూటర్ పెట్టిన ఆఫీస్ గదిలోనుండి అద్దాల కిటికీల నుండి ఎదురుగా వున్న పార్క్ కనబడుతుంది.

ఇంతకన్న పెద్ద ఇల్లు ఎందుకో ఆవిడకు అర్థం కాకపోయినా పూరుకున్నారు మంగమ్మగారు.

మరో బిడ్డ పుడితే పిల్లలిద్దరికీ చెరొక బెడ్ రూము, దంపతులిద్దరికి ఒకటి, ఏడాదికోసారి వచ్చి రెండు మూడు నెలలుండి వెళ్ళే అటువైపు ఇటువైపు తలిదండ్రులకు ఒకరూము కావాలని వాళ్ళ ఆలోచన.

"మేము హాయిగా లివింగు రూములోనో, డ్రాయింగు రూములోనో పడుకుంటే పోదా" అన్న మంగమ్మగారి మాటకు నవ్వేసింది బుజ్జి.

ఆదివారం రానే వచ్చింది. పొద్దున్నే లేచేశారు అందరూ. "పది గంటల లోపు మనం బయటకు వెళ్ళిపోవాలమ్మా. టిఫిన్ నేను తయారుచేస్తాను. ఏదన్నా సింపుల్‌గా వండేసి పట్టుకెడదాం" అంది బుజ్జి.

ఆ ఇల్లు బుజ్జి వాళ్ళు కొన్నప్పుడు మంగమ్మగారు అక్కడలేరు. గృహప్రవేశానికి వచ్చారు.

ఇవాళో నిన్ననో జరిగినట్టు ఆరోజు చేసిన సత్యనారాయణ వ్రతం గుర్తుంది ఆవిడకు.

ఏదో కాలేజిలో సంస్కృతం ప్రొఫెసరట పూజ చేయించడానికి వచ్చాడు. మొత్తం మూడు నాలుగు గంటలు పట్టే సత్యనారాయణ వ్రతం గంటన్నరలో ముగించాడు. వస్తువులేమో అన్నీ తెప్పించాడుగానీ పొట్లాలైనా విప్పకుండా నవధాన్యాలు దేవుని పటం ముందు పెట్టేశాడు.

ఫైర్ ప్లేస్‌లో హోమం చేశాడు. ఇంగ్లిషులో వున్న సత్యనారాయణ స్వామి వ్రతం కథల ప్రింటెడ్ కాపీలు బుజ్జికి, ఆమె భర్తకు, మంగమ్మగారికి, మంగపతి గారికి ఇచ్చి చదవమన్నాడు. తరువాత హారతికి "ఓం జయజగదీశ హరే" పాడి హారతిచ్చేసి రెండువందల యాభై డాలర్లు దక్షిణ తీసుకుని వెళ్ళిపోయాడు టయోటా కారు డ్రైవ్ చేసుకుంటూ.

కూతురు, అల్లుడూ వాళ్ళ స్నేహితులకు హోటల్లో భోజనాలు ఏర్పాటు చేశారు.

వంట చేస్తూ ఆలోచనలో పడిన మంగమ్మగారు "అమ్మా రియాల్టరు ఫోన్ చేశాడు. అరగంటలో వస్తాట్ట. ఆలోపుగా మనం కదలాలి. అతని దగ్గర మన ఇంటి తాళం మరొకటి వుంది" అంటూ బుజ్జి హడావుడి పెట్టడంతో గబగబ పని ముగించి, వంటిల్లు గట్టు హాట్‌ప్లేటు అన్నీ శుభ్రంగా తుడిచి చిన్నదాన్ని తీసుకుని కారెక్కారు.

ముందు 'ఫుడ్ మార్క్స్' కి వెళ్ళి జ్యూస్, 'కుకీస్' కొనుక్కుని ఎలిజబెత్ పార్క్‌కి వెళ్ళారు.

నాలుగు గంటల వరకు పార్క్‌లోనే గడిపి ఇంటి ముఖం పట్టారు. వీళ్ళు ఇంటికి వచ్చేసరికి రియాల్టరు ఇల్లు తాళం వేసి వెళ్ళిపోయాడు.

గరాజ్ లోపలి నుండి తాళం తీసుకుని ఇంట్లోకి వచ్చాక మంగమ్మగారు అన్ని గదులూ ఒకసారి తిరిగి చూశారు.

"ఏంటమ్మా వెదుకుతున్నావ్?" అని బుజ్జి అడిగితే "వస్తువులన్నీ వున్నాయా పోయాయా అని చూస్తున్నా. ఇంతకీ నీ నగలు అవీ అయినా డ్రాలో పెట్టి తాళం వేశావుటే?" అనడిగారు మంగమ్మగారు.

బుజ్జి పడి పడి నవ్వింది. "ఆ భయముంటే తాళాలు ఇచ్చేసి వెళ్తామా అమ్మా? చిన్న వస్తువు కూడా పోదు. దిగులు పడకు." అంది. నెల గడిచింది. నాలుగుసార్లు ఓపెన్ హౌస్ పెట్టారు. ఎక్కువగా చైనీస్ వచ్చి చూసిపోతున్నార్ట. కానీ వీరు పెట్టిన ఖరీదుకి అంటే ఏడువందల వేలకు దగ్గరగా ఎవరూ ఆఫర్ ఇవ్వలేదుట. 'వీళ్ళు కొన్న దానిమీద ఒక యాభై వేల డాలర్లు ఎక్కువ పెట్టారు. అదంతా లాభం అనుకోవడానికీలేదు. అందులో ముప్పైవేలు రియాల్టర్‌కి ఫీజు క్రిందపోతుంది.

"ఎక్కువ రోజులు ఇల్లు అమ్మకానికి మార్కెట్లో వుంటే విలువ తగ్గిపోతుందమ్మా.. పోనీ కొంచెం ఖరీదు తగ్గించి పెడదామంటున్నాడు రియాల్టరు." అంది బుజ్జి మంగమ్మగారితో.

"అక్కడికి మీకేమీ లాభం లేనట్టే. కొన్న ఖరీదు వెనక్కి వచ్చినట్టు. మీరు కొన్నది ఆరువందల వేలకు కదా?" అనడిగారు మంగమ్మగారు.

ఆవిడకు కూడా అమెరికా అలవాటు ప్రకారం 'వందల వేలల్లో' ఖరీదులు చెప్పడం, పిల్లల వయసు సంవత్సరమనో, ఒకటిన్నర సంవత్సరమనోకాక పదిహేను నెలల వయసనీ, ఇరవై నెలల వయసనీ చెప్పడం అలవాటయింది.

"ఇంకా ఎక్కువే అమ్మా. ఖరీదు తగ్గిస్తే లాభం మాట అటుంచి నష్టం వస్తుంది. అంటే రియాల్టరుకి మాచేతినుండి పెట్టుకోవాల్సి వస్తుంది" అంది బుజ్జి.

"అయితే ఇప్పుడు అమ్మడానికి తొందరెందుకు?" అనడిగారు మంగపతిగారు.

"ఎకనామీ రిసెషన్‌లో వుంది కదండీ మావయ్యా. ముఖ్యంగా హౌసింగ్ బూమ్ బబుల్ బరస్ట్ అయిందంటూన్నారు. విపరీతంగా అప్పులిచ్చేస్తారు. వాళ్ళు తీర్చక పోవడంతో బ్యాంకులు ఆ ఇళ్ళు అమ్మకానికి

పెట్టేస్తున్నాయి. మరి ఇంటి ధరలు పడిపోక ఏం చేస్తాయి? ఇంకో రెండేళ్ళు ఆగినా నష్టానికే అమ్మాల్సివస్తుంది. పోయిన సంవత్సరం అమ్మిన వాళ్ళు బోలెడు లాభంపొందారు. మరి మా దురదృష్టం ఈ ఏడాది ఇలా మార్కెట్ డౌన్ అయింది." అన్నాడు బుజ్జి భర్త.

"అవునే ఒక చైనీస్ కపుల్, ఒక ఇండియన్ జంట ఇంటి గురించి ఆసక్తి చూపారని, వచ్చేవారం వాళ్ళ పేరెంట్స్‌ని తీసుకుని వచ్చి చూపిస్తామన్నారని చెప్పాడు కదా మీ రియాల్టర్?" అనడిగారు మంగమ్మగారు.

"అవునమ్మా. చూద్దాం ఏం చేస్తారో.." దిగులుగా అంది బుజ్జి.

"మన ఇల్లు స్టేజింగ్ మానేజరు చైనీస్ పిల్లకదూ? ఆమెను ఒకసారి రమ్మని ఫోను చేయవే బుజ్జీ.. కాస్త మాట్లాడాలి" అన్నారు మంగమ్మగారు సాలోచనగా.

ఇంగ్లీషులో ఆ పిల్లతో సెపరేట్‌గా మాట్లాడక, ఇంటి అలంకరణలో కొన్ని మార్పులు చేయించారు మంగమ్మగారు.

'ఫెంగ్‌షూయ్' పద్ధతి ప్రకారం గాజుగిన్నెలో నీళ్ళుపోసి పువ్వులు వేసి ఒక మూల పెట్టించారు. అలాగే లాఫింగ్ బుద్ధా బొమ్మను గుమ్మం వైపుకు చూస్తున్నట్టు పెట్టించింది. ఈశాన్య మూలలో స్ప్రింక్లర్స్‌తో నీళ్ళు పడేట్టు ఏర్పాటు చేయించింది.

మళ్ళీ ఆదివారం ఓపెన్ హవుస్ వుందనగా శనివారం బుజ్జిని అడిగిందావిడ "మీ స్నేహితురాలు రజియా ఇల్లు ఇక్కడికి దగ్గరే కదూ? ఒకరోజుకి ఆ అమ్మాయి నడిగి బురఖా తీసుకురావే!" అని.

"బురఖాలో ఫోటో తీయించుకోవాలని సరదా పుట్టిందా ఏమిటమ్మా?" అంటూ నవ్వింది బుజ్జి.

"ఎందుకో తర్వాత చెప్తాను ముందు తీసుకురా" అన్నారు మంగమ్మగారు గంభీరంగా. అలాగే తెచ్చింది బుజ్జి.

"మనం రేపు ఆదివారం ఓపెన్ హౌస్ పెట్టినప్పుడు ఇది వరకటిలా ఎక్కడకో పోవద్దు. మన ఇంటి ముందున్న పార్కులోకి వెళ్ళి కూర్చుందాం హాయిగా. అందావిడ ఆ సాయంత్రం. మర్నాడు పదింటికి మామూలుగానే అంతరూ తయారవ్వగానే బురఖావేసుకుని పార్కుకి బయల్దేరింది మంగమ్మగారు.

"నేనుకూడా గడ్డం పెట్టుకోమంటావా?" అంటూ హాస్యమాడారు మంగపతిగారు.

వాళ్ళు ఇంటి ఎదురుగా రోడ్డుకి అటువైపు వున్న పార్కులో సెటిల్ అయ్యే సరికి రియాల్టరు రావడం, ఇల్లు చూడాలనుకున్న వాళ్ళు కార్లు ఇంటి ముందు ఆగడం జరిగాయి.

కాసేపయ్యాక మంగమ్మగారు హఠాత్తుగా లేచి "నేను మనింటిదాకా వెళ్ళొస్తా" అనేసి ఇంటివైపు నడిచారు.

***

పదిరోజుల్లో బుజ్జి వాళ్ళు తగ్గిద్దామనుకున్న ఖరీదుకే ఒక ఆఫర్ వచ్చింది. ఎక్కువ లాభం రాకపోయినా నష్టం మాత్రం రావడంలేదని ఆ ఆఫర్ ఒప్పేసుకున్నారు బుజ్జీ, ఆమె భర్తా. ఇల్లుకొనబోతున్నది పోయిన వారం వచ్చిచూసి వెళ్ళిన యంగ్ చైనీస్ కపుల్‌ట.

ప్రస్తుతం వున్న రిసెషన్‌లో కాలిఫోర్నియా ఖరీదుల్లో ఇంటిని అమ్మి పెట్టిన రియాల్టర్‌ని అభినందించారు బుజ్జీ వాళ్ళు. అతను చాల నిజాయితీగా చెప్పాడు. "నాదేం లేదు మేడమ్ పోయిన వారం ఒక బురఖాలోవున్న ముస్లిం లేడీ వచ్చి ఇల్లంతా చూసి ఇండియన్ వాస్తు ప్రకారం, చైనీస్ 'ఫెంగ్ షూయ్' ప్రకారం ఇల్లు చాల అచ్చివస్తుందని, ఇంట్లో 'చి' (పాజిటివ్ ఎనర్జి) బాగుందని, తను కొంటాననీ నాతో అందరి ముందూ చెప్పింది. ఇంతమంచి ఇల్లు ఎందుకు అమ్మేస్తున్నారు? వాళ్ళకు ఏమైనా ప్రాబ్లమా? అనడిగింది. మిగతా వాళ్ళు నావైపు చూస్తుంటే ప్రాబ్లమ్ ఏమీలేదనీ, నిజానికి ఈ ఇంటికి వచ్చాకే వారికి పాప పుట్టిందని భార్యకు మంచి ఉద్యోగం దొరికిందనీ, ఇప్పుడు ఇంకో బిడ్డ రాబోతున్నాడని పెద్ద ఇల్లు కొనాలని ఇది అమ్ముతున్నారనీ చెప్పాను. ఆ ముస్లిం లేడీ ఎవరో మళ్ళీ నన్ను కాంటాక్ట్ చేయలేదుగానీ ఆ చైనీస్ కపుల్ కొంటామని ఇ. మెయిల్ చేశారు." అన్నాడు.

***

మంగమ్మగారు ఇండియా బయల్దేరేముందు బుజ్జి తల్లిని కౌగిలించుకుని "నీ బుఱ్ఱ అమోఘం అమ్మా. వాస్తుగురించి ఫెంగ్‌షూయ్ గురించి మాట్లాడి వాళ్ళను ఇంప్రెస్ చేసేశావు. ఇల్లు అమ్మి పెట్టావు" అంది.

"మంగమ్మగారి మార్కెటింగ్ స్ట్రాటజీ మరి అమోఘం కాదా ఏమిటి?" అని నవ్వేశారు మంగపతిగారు.

***